క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

జి.కొండూరు: పారిశుద్ధ్యం మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మైలవరం నియోజకవర్గ ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. పినపాక గ్రామాన్ని మండల ప్రత్యేకాధికారి మోహన్‌బాబుతో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, శానిటేషన్, మంచినీటి సరఫరాను పరిశీలించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేములకొండ వెంకటేశ్వరమ్మ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన

తిరువూరు: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీనివాస్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం రాష్ట్ర ఫెడరేషన్ పిలుపు మేరకు ఆందోళన నిర్వహించిన ఉపాధ్యాయులు తహసీల్దారు ప్రకాష్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. విధి నిర్వహణలో భాగంగా పలు యాప్‌లలో సమాచారం నమోదు చేయడం, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ తదితర అదనపు విధులతో సతమతమవుతున్న ఉపాధ్యాయులపై భారం తగ్గించాలని కోరారు. జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ చెన్నయ్య బాధ్యతల స్వీకారం

గంపలగూడెం: గంపలగూడెం మండల పరిషత్ అధికారిగా చెన్నయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రస్తుత ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు నుంచి విధులను స్వీకరించారు. హైకోర్టు విధుల్లో ఉన్న చెన్నయ్యను ఉన్నతాధికారులు గంపలగూడెం ఎంపీడీఓగా నియమించారు. గడచిన తొమ్మిది నెలలుగా తిరువూరు ఎంపీడీఓ నాగేశ్వరరావు ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

నాగపూర్ జెండా గంధ మహోత్సవానికి పీఠాధిపతులు

ఎ.కొండూరు: చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్, విజయనగరం దర్బార్ పీఠాధిపతులు మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా తాజ్ ఖాదరి, మహమ్మద్ ఖలీల్ బాబా భక్త బృందంతో బుధవారం నాగపూర్ షరీఫ్‌లోని హుజూర్ హజరత్ తాజుద్దీన్ బాబా వారి జెండా గంధ మహోత్సవానికి బయలుదేరి వెళ్లారు. పీఠాధిపతి ఖాజా మొహియుద్దీన్ మాట్లాడుతూ ఆగస్టు రెండో తేదీన బాబా వారి మహోత్సవం జరుగుతుందని, ఈ మహోత్సవంలో చాదర్ పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొంటామని, వారం రోజులు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

రిటైర్డ్ పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు



విజయవాడస్పోర్ట్స్: పోలీస్ శాఖ ద్వారా సుదీర్ఘ కాలం పాటు ప్రజలు సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఆరుగురు పోలీసు అధికారులకు పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆత్మీయ వీడ్కోలు పలికారు. బుధవారం రిటైర్ అయిన ఆర్ఎస్ఐ ఆర్.పండునాయక్(సీఏఆర్), ఏఎస్ఐలు డి.వెంకటేశ్వర్లు(గంపలగూడెం), సీహెచ్ దుర్గారావు(జి.కొండూరు), హెడ్‌కానిస్టేబుళ్లు వి.లక్ష్మీనారాయణ(మహిళా పోలీస్ స్టేషన్), టీవీ అప్పారావు(పీసీఆర్), ఎస్.కృష్ణప్రసాద్(సీఏఆర్)లను పోలీస్ కమిషనరేట్‌లో దుశ్శాలువాలతో సత్కరించారు. డీసీపీలు హరికృష్ణ, చక్రవర్తి, ఏడీసీపీ కృష్ణమూర్తి నాయుడు, కార్యాలయ ఏవో రంగారావు, ఏసీపీ ప్రసాదరావు, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు సోమయ్య పాల్గొన్నారు.

ట్యాపుల్లో మురికి నీటి సరఫరా

నూజివీడు: పట్టణ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో బుధవారం కృష్ణా జలాల పథకం ట్యాపుల్లో నుంచి మురికి నీరు రావడంతో కాలనీ వాసులు ఆందోళనకు గురయ్యారు. ఇటీవల మంత్రి ఆదేశాల మేరకు మైలవరం రోడ్డులోని కృష్ణా జలాల పథకం సంపును, ఫిల్టర్ బెడ్‌లను శుభ్రం చేసినప్పటికీ ట్యాపుల్లో మురికినీరు రావడంపై కాలనీవాసులు ఆశ్చర్యానికి గురయ్యారు. వర్షాకాలం కావడం, ప్రజలు జ్వరాలతో బాధపడుతున్న సమయంలో ట్యాపుల్లో మురికి నీరు రావడంపై భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. డయేరియా వంటి వ్యాధులు పొంచి ఉన్న సమయంలో శుభ్రమైన మంచినీటిని సరఫరా చేయాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ





పుట్రేల మారెమ్మ అమ్మవారికి సారె సమర్పించి పూజల్లో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు ; కిలేశపురంలో గంగానమ్మకు సారె సమర్పించేందుకు వస్తున్న మహిళలు

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): గంగానమ్మ అమ్మవారికి భక్తులు బుధవారం ఆషాఢ సారె సమర్పించారు. తొలుత గ్రామ నడిబొడ్డున ఉన్న బొడ్డు రాయికి నీళ్లు వారబోసి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. అక్కడి నుంచి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించి గంగానమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు బాలసుబ్రహ్మణ్యం భక్తులు తెచ్చిన సారెను అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

మారెమ్మ అమ్మవారికి..

పుట్రేల(విస్సన్నపేట): పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి పుట్రేల, కోటిపల్లి, నూతిపాడు, సత్తెనగూడెం, తెల్లదేవరపల్లి, మల్లేల గ్రామాల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ సారెను బుధవారం సమర్పించారు. ఆర్య వైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు, ప్రసాదాలు సమర్పించారు.

ఆక్రమణల తొలగింపు గడువు పొడిగించాలి

కమిషనర్ లోవరాజుకు పలువురి వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గంగాధర్, సభ్యులు

తిరువూరు: పట్టణ ప్రధాన రహదారిలో ఆక్రమణల తొలగింపునకు విధించిన గడువు పొడిగించాలని నగర పంచాయతీ కమిషనర్ లోవరాజును చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొత్తూరు గంగాధరరావు కోరారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసిన గంగాధరరావు, సభ్యులు సమస్యలు వివరించారు. అర్ధంతరంగా డ్రైయినేజీలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలివ్వడంతో చిరు వ్యాపారులు ప్రత్యామ్నాయం లేక ఇబ్బంది పడతారని, వారి దుకాణాలను తరలించేందుకు నెల రోజులు అవకాశం ఇవ్వాలని కోరారు.

ఎమ్మెల్యేకి సీపీఐ నేతల వినతి

తిరువూరు మెయిన్ రోడ్డులో డ్రైయినేజీలపై ఆక్రమణల తొలగింపునకు నగర పంచాయతీ అధికారులు ఇచ్చిన గడువు పొడిగించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు సీపీఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. చిరు వ్యాపారులు ఇబ్బందిపడే అవకాశం ఉన్నందున కనీసం ఒక నెల రోజుల పాటు గడువు ఇవ్వాలని సీపీఐ నాయకులు నాగుల్‌మీరా, ఉదయ్, అశోక్, సుబానీ కోరారు.

అవసరమున్న వారికి గడువు ఇస్తాం: ఎమ్మెల్యే

డ్రైయినేజీలపై ఆక్రమణల తొలగింపునకు ఏవైనా ఇబ్బందులున్నట్లు చెబితే గడువు తప్పక ఇస్తామని ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అన్నారు. డ్రైయినేజీలు శుభ్రం చేసేందుకు నగర పంచాయతీ అధికారులు తీసుకుంటున్న చర్యలకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

తహసీల్దార్లకు సిబ్బంది సన్మానం



తహసీల్దార్ సుగుణను సన్మానిస్తున్న సిబ్బంది

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ డి.సుగుణ సొంత జిల్లా తూర్పు గోదావరికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది బుధవారం ఆమెను ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా గంపలగూడెంకు బదిలీపై వచ్చి ఆరు నెలలపాటు విధులను సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా రెవెన్యూ శాఖకు సంబంధించి ఎన్నో తెలియని విషయాలను వివరించారని కొనియాడారు. డెప్యూటీ తహసీల్దార్ రాధికారాణి, వీఆర్వోలు, వీఏఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఎం నగేష్‌కు సన్మానం



హెచ్ఎం నగేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎ.కొండూరు: కంభంపాడు గ్రామంలోని ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.నగేష్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నగేష్, రమాదేవి దంపతులను ఉపాధ్యాయులు పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఎంఈఓ ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు నగేష్ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసే విద్యార్థులకు మంచి విద్యను అందించాలని కొనియాడారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా గుర్తింపు పొందాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఇబ్రహీంపట్నంలో ధర్నా

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్వారీలలో ప్రమాదాలు, పరిశ్రమలలో కాలుష్యంపై ఆగస్టు 2వ తేదీన ఇబ్రహీంపట్నంలో ధర్నా నిర్వహిస్తామని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తెలిపారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ధర్నా వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలలో ప్రమాదాలు, క్వారీలలో భద్రతను పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్నారు. ఫలితంగా అమాయకులైన కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయన్నారు. క్వారీలు, పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటించాలని కోరుతూ ఇబ్రహీంపట్నం సెంటర్‌లో ధర్నాకు పిలుపు నిచ్చారు. ఈ ధర్నాలో సీపీఐ జిల్లా శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

లక్ష్మీపురం(తిరువూరురూరల్): లక్ష్మీపురంలో బుధవారం దోమల నిర్మూలనకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలోని నివాస గృహాల మధ్య రోజుల తరబడి నిల్వ ఉన్న నీటిలో దోమలు పెరగకుండా ఆయిల్ బాల్స్ వేశారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సర్పంచి గొల్లమందల శ్రీనివాసరావు సూచించారు. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం ట్యాంకును క్లోరినేషన్ చేశారు.

దోమల నివారణకు ఫాగింగ్

చాట్రాయి: కృష్ణారావుపాలెం పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లారావు, హెల్త్ సూపర్‌వైజర్ సోమశేఖరావు, పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి పాల్గొన్నారు.

పింఛన్‌దారులు అందుబాటులో ఉండాలి

గంపలగూడెం: ఆగస్టు నెల సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం జరుగుతుందని, లబ్ధిదారులు ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని 11,682 మంది పింఛన్‌దారులకు పంపిణీ చేసేందుకు రూ.4.90 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు.

● **కె.తాడేపల్లి(విజయవాడరూరల్):** కొత్తూరు తాడేపల్లి గ్రామంలో గురువారం జరిగే పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొంటారని ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్వీ శేషగిరి రావు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమంలో సర్పంచి గోపాలరావు పాల్గొంటారన్నారు.

కరపత్రాల పంపిణీ

తోటమూల(గంపలగూడెం): సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ గంపలగూడెం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. జేవీవీ సభ్యులు పాల్గొన్నారు.

కోకిలంపాడులో కచ్చా డ్రెయిన్ల తవ్వకం

సాక్షి స్పందన



తిరువూరురూరల్: మండలంలోని కోకిలంపాడులో ఆర్ అండ్ బీ రహదారిపై వర్షం నీరు నిలిచిపోయి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై బుధవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై మండల పరిషత్ అధికారులు స్పందించారు. పొక్లెయిన్‌తో రోడ్డు వెంట కచ్చా డ్రెయిన్లను తవ్వించి నీటి పారుదలకు వీలు కల్పించారు. పనులను ఈఓపీఆర్‌డీ బండి వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

నేడు మండలానికి మంత్రి రాక

ముసునూరు: మండలంలో గురువారం నిర్వహించనున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి పాల్గొంటారని ఎంపీడీఓ పద్మావతీదేవి తెలిపారు. మండలంలోని కాట్రేనిపాడు, గోపవరం గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని చెప్పారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

గానుగపాడు(తిరువూరురూరల్): విద్యార్థులు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రహదారి భద్రతా నియమావళిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం బుధవారం పాఠశాలలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్‌ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడిపేవారే అత్యధికంగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, అతి వేగం అనర్థదాయకమని చెప్పారు. రోడ్డు భద్రతా నియమావళిని వివరిస్తూ జేవీవీ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు రాంప్రదీప్, సుదర్శన్, సాయిరాం పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ఇబ్రహీంపట్నం: కొండపల్లి అడవి క్వారీ ఎంపీయూపీ పాఠశాలలో కేతనకొండ సీయోను మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా పరికరాలను బుధవారం పంపిణీ చేశారు. సిస్టర్ అలెక్స్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు, పాస్టర్ మొగులూరి సుశేశ్వరరావు, బ్యూలా, ఎం.రాజేష్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల ప్రహరీ నిర్మాణం, రంగులకు విరాళం

గోసవీడు(గంపలగూడెం): గోసవీడులో మదన వేణుగోపాలస్వామి ఆలయం, శివాలయాలకు ప్రహరీ నిర్మాణం, రంగులు వేసేందుకు ఓ భక్తుడు రూ.95 వేలను ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. దివంగత కాజా ఇంద్రాణి జ్ఞాపకార్థం భర్త కాజా రాజేశ్వరరావు, కుమారుడు జ్ఞాన ప్రకాష్‌లు ఈమొత్తాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు.

రూరల్ మండలాభివృద్ధికి నిధులు మంజూరు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండల అభివృద్ధికి రూ.2.5 కోట్లు మంజూరయ్యాయని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపూడిలోని తన కార్యాలయంలో రూరల్ మండలానికి చెందిన కూటమి నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంజూరైన నిధులను జక్కంపూడి, షాబాద, రాయనపాడు, పైడూరుపాడు గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు కేటాయిస్తున్నామని చెప్పారు. గొల్లపూడి గ్రామాభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తామన్నారు.

కౌమారదశ బాలికలకు అవగాహన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో కౌమారదశ బాలికలకు ఉన్న అపోహలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఐసీడీఎస్ ఈలప్రోలు సెక్టార్ సూపర్ వైజర్ జి.రమాదేవి కౌమారదశ బాలికలకు శరీరంలో కలిగే మార్పులు, వారి సందేహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సామాజికంగా ఎదురయ్యే గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై వీడియో ద్వారా తెలియజేశారు. బాలికల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.పద్మలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కునకు వేలం

నెమలి(గంపలగూడెం): నెమలి ఆలయంలో ఆగస్టు ఒకటి నుంచి ఏడాది పాటు కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే హక్కునకు అధికారులు బుధవారం ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించారు. నెమలికి చెందిన కఠారు వెంకట నాగశివకృష్ణ అత్యధికంగా రూ.1,11,500లకు పాడి కైవశం చేసుకున్నారు. సహాయ కమిషనర్ సాంబశివరావు, పుట్రేల దేవస్థానం ఈఓ సీతారామయ్య, ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

9 మంది జూదరుల అరెస్ట్

చాట్రాయి: పేకాట శిబిరంపై దాడి చేసి 9 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణారావుపాలెం గ్రామ పొలిమేరలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1.25 లక్షల నగదు, 6 బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పేకాట శిబిరంపై దాడి..

మైలవరం: పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ హరి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అందిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 6 బైక్‌లు, రూ.4,560 నగదును స్వాధీనం చేసుకున్నారు.

మహిళను మోసగించిన విలేకరి అరెస్ట్

తిరువూరు: రోలుపడికి చెందిన ఒంటరి మహిళను మాయమాటలతో మోసగించిన విలేకరి కంభంపాటి నాగరాజును పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నాగరాజు ఆమె వద్ద డబ్బులు తీసుకోవడమే కాక పెళ్లి చేసుకోమని వెంటపడి వేధించేవాడు. విసిగిపోయిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నాగరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ 15 రోజుల రిమాండ్‌కు ఆదేశించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సీఐ సత్యనారాయణ



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు పూర్తిగా అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎం. సత్యనారాయణ అన్నారు. ఇబ్రహీంపట్నం జాకీర్ హుస్సేన్ కళాశాలలో సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దన్నారు. ఫోన్‌లో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగల్ పే, ఫోన్ పే, ఈకేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించ వద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు తక్షణమే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేయవచ్చని వివరించారు. మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు దుర్లభంగా మారతాయన్నారు. యువత, విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌డీ మస్తాన్‌వలి, ఎన్ఎస్ఎస్ అధికారులు నాగుల్‌మీరా, జాఫర్‌సాధిక్ పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ

ముసునూరు: ముసునూరులోని బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వసతి, సౌకర్యాలను, అదనపు తరగతి గదులు, క్రీడా మైదాన నిర్మాణాలను, విద్యా బోధనను, సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠ్యాంశాలను నూరు శాతం బోధనోపకరణాలతో బోధించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ పాటించాలి..

మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం నాణ్యతగా తయారు చేసి, విద్యార్థులకు అందించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు ఆదేశించారు. ముసునూరు హైస్కూల్లో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించి వంట ఏజెన్సీదారులు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వహణ రికార్డులను తనిఖీ చేశారు. హెచ్ఎం సునీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ ఎన్నికల షెడ్యూల్

ముసునూరు: మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు తల్లిదండ్రుల కమిటీల ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆగస్ట్ ఒకటి నుంచి ఎనిమిదో తేదీ వరకు ఎన్నికల ప్రక్రియ చేపడతామన్నారు. ఎనిమిదో తేదీన కమిటీల ఎన్నికలు నిర్వహించిన అనంతరం తొలి సమావేశాలతో షెడ్యూల్ ముగుస్తుందని చెప్పారు.

● **గంపలగూడెం:** ప్రభుత్వ పాఠశాలల్లో మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు గురువారం ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారని ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఆయా పాఠశాలల్లో ఓటర్ల జాబితా విడుదల చేస్తారన్నారు. 5వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, మధ్యాహ్నం మూడు గంటలకు ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని చెప్పారు. 8వ తేదీన ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కమిటీ సభ్యుల ఎన్నిక, అనంతరం 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, రెండు గంటలకు ప్రమాణ స్వీకారం జరుగుతుందని వివరించారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షురాలిగా లక్ష్మి

ఆగిరిపల్లి: యూటీఎఫ్ ఆగిరిపల్లి మండల శాఖ అధ్యక్షురాలిగా మల్లిబోయినపల్లి మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈదులగూడెం జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అజరయ్య ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

కచ్చా డ్రెయిన్ల ఏర్పాటుకు ఆదేశాలు

మల్లేల(తిరువూరురూరల్): మండలంలోని మల్లేలలో రహదారి మార్జిన్లపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మల్లేలలోని రహదారులను పరిశీలించారు. మురుగునీరు, వర్షపునీరు రోడ్లపై పారుతుండటంతో పారిశుద్ధ్య సమస్య ఏర్పడుతోందని, వెంటనే కచ్చా డ్రెయిన్లు తవ్వించాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ జి. రమేష్‌బాబు తెలిపారు. మైలవరం పరిధిలోని సూరిబాబు పేట, ప్రజా వైద్యశాల రోడ్డు, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్డు, కోత మిషన్లు, రాజాపేట, కుమ్మరి వీధి, శివాలయం వీధి, నారాయణ నగర్, మాలపల్లి, చంద్రబాబు నగర్, నూజివీడు రోడ్డు, పాత మసీదు, గ్యాస్ కంపెనీ రోడ్డు, చిన్నగూడెం, శాంతినగర్, దేవుని చెరువు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

● **గంపలగూడెం:** మండలంలోని ఊటుకూరు, పెనుగొలను విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ జగదీష్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.